# మనో వీక్షణం

- జొన్నలగడ్డ శ్యామల, Hyderabad

ఎదురుగా వున్న కిటికీ అద్దాల్లోంచి మొత్తం ప్రకృతి రమణీయ వర్ణచిత్రంలా ఉంది. సృష్టికర్త ఎంత గొప్ప చిత్రకారుడో! ఫాల్ సీజన్ కావడంతో రంగులు మారిన చెట్లు కొత్త అందాలు సంతరించుకుని, హొయలొలకబోస్తున్నాయి. అడుగుల సవ్వడికి నాచూపు వెనుతిరిగింది. నర్స్ "హాయ్ హౌ ఆర్ యు" అంటూ పలకరించింది.

"ఫైన్" అని నేను బదులిస్తుండగానే బెడ్ మీద నిదురపోతున్న కాంతిని చూసి "ఐ విల్ కమ్ లేటర్" అంటూ వెళ్ళిపోయింది. కాంతి తగ్గిన కాంతిని చూస్తోంటే మనసు మెలిపెట్టినట్లు అయింది. కాలం మనిషిని కీలుబొమ్మని చేసిఆడిస్తుంది. క్షణాల్లో బతుకు బండిని కుదిపేస్తుంది. ఊహించని మలుపులు తిప్పి మనోధైర్యానికి సవాలు విసురుతుంది. కాకపోతే ఏమిటి, నాకు దూరంగా సుదూరంగా ఉన్నా మనసులో సదా నాకు చేరువగా ఉండే నాప్రాణంలో ప్రాణం నాకంటి 'కాంతి' "అమ్మా! క్వాలిఫైయింగ్ ఎగ్జామ్ పాసయ్యాను" ఆనందోద్వేగాలతో చెప్పిన తీయని మాట నా చెవుల్లో ఇంకా మార్మోగుతూనే ఉంది. అంతే కాదు ఆ తర్వాత కూడా ప్రతి ఉదయం, కరెంటు లేకపోతేతప్పితే (ఇండియాలో) కాంతితో మాట్లాడని రోజేలేదు. అలాంటిది ఆరోజు యాహూలో తనదగ్గర్నుంచి రెస్పాన్స్ లేదు. లాబ్‌నుంచి లేటుగా వచ్చిందేమో అనుకున్నా. సెల్ కు చేద్దామంటే "కొత్త సెల్ తీసుకుంటున్నా పాతదాని కాంట్రాక్ట్ అయిపోయింది. కొత్త నంబరు వచ్చాక చెబుతా" అంది. తనే ఫోన్ చేస్తుందిలే అనుకొని ఆఫీసుకు వెళ్ళిపోయా. పనిలో పడితే ఇంటి ధ్యాస ఉండదు.

సాయంత్రమవుతుండగా బంధువులనుంచి ఫోన్. అశనిపాతం లాటి వార్త... కాంతికి యాక్సిడెంట్ అయిందట. తీవ్రంగా గాయపడ్డదని ... అధైర్యపడకు అంటూ ఇంకా ఏవో చెపుతున్నారు.

మనసు మొద్దుబారింది. అవిరామంగా కన్నీళ్ళు. ఆఫీసు బయటకు వచ్చాను. వాన పడుతోంది. కొలీగ్ సాయంతో ఎలాగో ఇల్లు చేరాను. రెక్కలు కట్టుకు కాంతి చెంతవాలాలని ఉన్నాఎక్కడిహైదరాబాదు,ఎక్కడి లెక్సింగ్‌టన్!

స్పీడ్ యుగమని అంటూంటాం కానీ ఇలాంటి సందర్భాల్లో అంతా అబద్ధం అనిపిస్తుంది. వీసా తతంగం, ఫ్లైట్ టికెట్ల బుకింగ్, మధ్యలో పనులు సజావుగా జరగకుండా అడ్డంపడే సెలవ రోజులు. ప్రయాణపు ఏర్పాట్లు వగైరా...వగైరా.. అందుకోలేనంత దూరంలో ఉన్న అమ్మను. ఎందరో స్నేహితులు, ఒకరిద్దరు బంధువులు కాంతిని కాపాడారు.

ఎట్టకేలకు లోహవిహంగ ప్రయాణం ఫలించి వారం తర్వాత కాంతిని చేరగలిగాను. అప్పటికే యు.కె. హాస్పిటల్ నుంచి కార్డినల్ హిల్ రిహాబిలిటేషన్ సెంటరుకు మార్చారు.

"ఎలాంటి నాకాంతి ఎలా అయింది" కన్నీళ్ళు నిండిన నా కళ్ళకు కాంతి రూపం మరింత మసగ్గా..... పరుగులాంటి నడక నడిచే నాకాంతి కాలికి రెండు చోట్ల ఫ్రాక్చర్స్ అయ్యాయట! సర్జరీ చేసారు. కాలికి బూటు. కంటికి పైగా గాయం.

'ఇంకా నయం, కన్ను క్షేమంగా ఉంది' నన్ను చూసిన కాంతి దుఃఖంతో పూడుకుపోయిన గొంతుతో "అమ్మా" అంది.

నా బాధను, భయాన్ని నొక్కిపట్టేసి "తగ్గిపోతుందిరా, నేనొచ్చేశాగా, అన్నీ బాగవుతాయి, ఏం కాదు. ధైర్యంగా ఉండు. విల్ పవర్ ని మించింది లేదు తెలిసిందా" తల నిమురుతూ ఏవేవో చెప్పాను.

"వేల్యుబుల్ టైమ్ అమ్మా ఇప్పుడు నా పి.హెచ్.డి ఇంకా లేట్...." మాట పూర్తి చేయలేకపోయింది కాంతి. "జీవితకాలంతో పోల్చుకుంటే ఆర్నెల్లు ఎంతరా, అయినా నూరేళ్ళ జీవితం ప్రమాదంనుంచి బయట పడింది. అదే దృష్టం అనుకోవాలి. పాజిటివ్‌గా ఆలోచించు" చెప్పాను.

మర్నాడు అర్థమయింది. తను చేయి కూడా లేపలేకపోతోందని. ఫ్రాక్చరు ఏమీలేదు. ఫిజికల్ ఎక్సర్ సైజులు చేయిస్తున్నారు. ముత్యాల్లాంటి అక్షరాలు రాసే కాంతి అప్పుడే అక్షరాలు నేర్చుకునే పిల్లల్లా పెద్దపెద్ద అక్షరాలే రాయగలుగుతోంది. ప్రాక్టీసు చేస్తే మామూలు రైటింగ్ వస్తుందన్నారు.

కాంతి ప్రయత్నలోపం లేకుండా రోజూ కొద్దిసేపు రాస్తోంది. క్రమంగా

చిన్న అక్షరాలు కుదురుగా రాస్తోంది. కొంతలో కొంత సంతోషం.

"అమ్మా" కాంతి పిలుపుకు నా ఆలోచనకు తెరపడింది.

mmmm mmmm mmmm

పదింటికల్లా కాంతి దగ్గరకు వెళ్ళటం, అక్కడి రకరకాల రోగులను, నర్సులను, థెరపిస్ట్‌లసేవలను ఆసక్తిగా గమనించడం, కాంతికి కావలసినవి చూస్తూ, ధైర్యం చెబుతూ, తనకోసం వచ్చే స్నేహితులతో మాట్లాడుతూ రాత్రి ఎనిమిదింటికి తిరిగి ఇంటి ముఖం పట్టడం నా దినచర్య అయింది. ఫిజికల్, ఆక్యుపేషనల్, స్పీచ్ థెరపీలతో కాంతి తనని తాను మెరుగు పరుచు కుంటోంది.

ఎప్పుడు, ఎక్కడ ఎదురైనా "హాయ్ హౌ ఆర్ యు" అంటూ చిరునవ్వుతో పలకరించే ఇక్కడివారి ఆప్యాయత నన్నెంతగానో ఆకట్టుకుంది. పరిచయమేమీ లేకపోయినా ఎదురైన మనిషిని చిరునవ్వుతో విష్ చేయడం ఎంత చక్కని అలవాటు!

అదే నా మాతృదేశంలో అయితే కొత్తవారి సంగతి అలావుంచి, పరిచయస్థులు ఎదురైనా చాలామంది పలకరింపులో పొదుపు పాటించే సందర్భాలే అధికంగా ఉంటాయి. ఎవరికి వాళ్ళు ఎదుటివారే పలకరించాలనే పంతంతో చూసీచూడనట్లు సాగిపోతుంటారు.

రోజులు వారాలయ్యాయి. వారాలు నెలగా మారాయి. కాంతిని డిశ్చార్జి చేశారు. కాంతిని వీల్ చెయిర్ లో ఇంట్లోకి తీసుకొస్తుంటే నాగుండె చెమ్మగిల్లింది. కొంతకాలం ఓర్చుకోక తప్పదు. ఏం చేస్తాం. ఈ మాత్రంగా అయినా ప్రాణాలతో బయటపడటం అదృష్టం అనుకోవాలి.

కాంతి మెల్లమెల్లగా తన పనులు తను చేసుకోవటానికి ప్రయత్నిస్తోంది. చదువుకుంటోంది. ల్యాప్ టాప్ మీద పని చేసుకుంటోంది. రోజులు గడుస్తున్నాయి. కాలికి వేసిన స్టేపుల్స్ తీసేశారు. హీలింగ్ బావుందన్నారు. మరో నెల గడిచింది.

ఇక వీల్ చెయిర్ వదిలేసి వాకర్ తో నడవమని చెప్పారు. 'అబ్బ! ఒక మెట్టు దాటింది' అనుకున్నా. కాంతి వాకర్‌తో సాధన చేస్తోంది. తోడుగా నేను.

క్యాలెండర్ లో పాత సంవత్సరం ముగిసింది. కొత్త సంవత్సరం ప్రారంభమైంది. శుభాకాంక్షల సందడిలో కొత్త సంవత్సర ధ్యేయానికి సంబంధించిన ప్రశ్నలు. తనను తాను పునర్నిర్మించుకోవటమే తనధ్యేయమంది కాంతి. అంతేకదా మరి.

వాతావరణం అతిచల్లగా మారుతోంది. మంచువాన నాకు కొత్తగా, గమ్మత్తుగా ఉంది. కొన్ని చోట్ల తివాచీ పరిచినట్లు మంచు పరుచుకుంది, మరి కొన్ని చోట్ల వెన్నముద్దలు అలంకరించినట్లు. ఆకులు రాలి బోసిపోయిన చెట్లన్నీ మంచుతొడుగుల్లో ముస్తాబై, విన్నూత్న కళాఖండాల్లా తోస్తున్నాయి. కాలం పోకడ ఎంత చిత్రం! మోడులైన తరువులు ప్రస్తుత కాలానికి తలవంచినా వసంతం రాగానే ఆకుల నగలు సింగారించుకోవూ, సంతోషంతో తలలూపుతూ తమదైన సంగీతాన్ని వినిపించవూ!

కాలమెంత వేధించినా, మనిషే గొడ్డళ్ళతో గాయపరిచినా చెట్లు అన్నిటినీ తట్టుకుని, మళ్ళీ మళ్ళీ చిగురిస్తూ, పుష్పిస్తూ, ఫలిస్తూ తమ చేవ చూపుతూనే వుంటాయి. ప్రకృతే చక్కటి సందేశాన్ని అందిస్తోంది. మనం అర్ధంచేసుకోవాలి అంతే!

'నా కాంతి కూడా మళ్ళీ వసంతపు నవ్వులా' అనుకుంటూ వుండగానే "అమ్మా! వచ్చే వారం నుంచి నేను ల్యాబ్ కు వెళతాను" కాంతి అంది. ఆ మాట నా చెవులకు కోయిల పిలుపులా వినిపించింది. mmmm